క్లుప్తంగా

చికిత్స చేయించాలి



అడ్డాకుల: మూగజీవాలు వ్యాధులకు గురైనప్పుడు వాటికి సకాలంలో చికిత్స చేయిస్తే ప్రయోజనం ఉంటుందని డాక్టర్ మధుసూదన్ అన్నారు. శుక్రవారం స్థానిక పశువైద్య కేంద్రం వద్ద పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. మూసాపేట, అడ్డాకుల, చిన్నచింతకుంట పశువైద్యశాల పశువైద్యులు సింధూజ, మధుసూదన్, రాధ పశువులు, గేదెలకు వైద్యపరీక్షలు చేశారు. చూడీ నిర్ధారణ, గొడ్డుమోతు పశువులకు చికిత్స, దూడలకు నట్టలనివారణ మందులను వేశారు. పశువైద్య సిబ్బంది ప్రభాకర్, రాజేశ్వరి, శివ, చంద్రమోహన్‌గౌడ్, సావిత్రి ఉన్నారు.

సంత్ గాడ్గేబాబాకు ఘన నివాళి

మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పాత పాలమూరు జైభీమ్ చౌరస్తాలో సంత్ గాడ్గే బాబా 68వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల శోభయాత్ర కమిటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పాతూరి రమేష్ మాట్లాడారు. జైభీమ్ చౌరస్తాలో సంత్ గాడ్గేబాబా చిత్రపటానికి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. రజక రిజర్వేషన్ సమితి ఉమ్మడి జిల్లాఅధ్యక్షుడు శివన్న, మహబూబ్‌నగర్ జిల్లాఅధ్యక్షుడు రాజగోపాల్, నాయకులు వెంకట్రాములు, వెంకటస్వామి, కాలె నరేందర్, టీచర్ చెన్నయ్య, శివన్న, ఎస్.రాజు, బొర్ర సురేష్, దిలీప్, యాదగిరి, దినేష్, మన్యం, వేణుగోపాల్, రాము, ప్రతాప్, దండు దేవన్న, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

మిడ్జిల్: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో, ప్రైవేటు పాఠశాలల్లో 9, 10వ తరగతి చదవుతున్న విద్యార్థులకు శనివారం చేయూత అన్వే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యా అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు వెంకటేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్, డీఈఓతో పాటుగా మోటివేషన్ స్పీకర్ వేణుకళ్యాణ్, సినీ యాక్టర్ ప్రదీప్ కుమార్ హాజరు అవుతారన్నారు. విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆటోడ్రైవర్ల అరెస్ట్



జడ్చర్ల టౌన్: చలో అసెంబ్లీకి పిలుపునిచ్చిన ఆటో డ్రైవర్లను శుక్రవారం ఉదయం పోలీసులు ముందుస్తు అరెస్టులుచేసి స్టేషన్‌కు తరలించారు. సీఐ ఆదిరెడ్డి నేతృత్వంలోని సిబ్బంది ఆటో డ్రైవర్లను అదుపులోకి తీసుకుని కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. పోలీసులు అడ్డుకోవటంపై ఆటో యూనియన్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

28న రేషన్ బియ్యం వేలం

అడ్డాకుల: మూసాపేట మండలంలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసిన 13 క్వింటాళ్ల బియ్యాన్ని ఇటీవలే కొందరు అక్రమంగా తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. వాటిని ఈనెల 28వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు తహసీల్దార్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు బహిరంగ వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురి అరెస్ట్

మహబూబ్‌నగర్ క్రైం: అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిని ట్రాఫిక్ పోలీసులు అరెస్ట్‌చేశారు. బోయపల్లి సమీపంలో శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్ సీఐ భగవంతురెడ్డి, ఎస్‌ఐ బద్రీనాథ్ ఆధ్వర్యంలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ నుంచి నవాబ్‌పేట వైపు వెళ్లే వాహనాలతో పాటు వచ్చే వాహనదారులను బ్రీత్ ఆనలైజర్‌తో తనిఖీలు చేశారు. నలుగురు వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు తేలింది. వాహనదారులపై కేసు నమోదుచేశారు. వాహనాలను స్టేషన్‌కు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా

దేవరకద్ర: మండలంలోని నాగారం శివారులో శుక్రవారం ఇసుక ట్రాక్టర్ శుక్రవారం బోల్తా పడింది. ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ కావడంతో పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు. కాగా సమీపంలో ఉన్న కోయిల్‌సాగర్ వాగు నుంచి నిత్యం పెద్ద ఎత్తున ట్రాక్టర్ల ద్వార ఇసుకను తరలిస్తున్నట్లు ఉన్న ఆరోపణలను నిజంచేస్తూ ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటన నిదర్శనం. అధికారులు ఇసుక రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జడ్చర్లలో ఏబీసీ కేంద్రం

- రూ.36లక్షలతో నిర్మాణ పనులు
- కుక్కలను పట్టుకొచ్చేందుకు ఓ ఏజెన్సీతో ఒప్పందం
- నిర్మాణ పనులను పరిశీలించిన అధికారులు



ఏబీసీసీ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, వార్డు కౌన్సిలర్లు

జడ్చర్ల టౌన్: కుక్కల నియంత్రణకు యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్‌ను జడ్చర్లలో నిర్మిస్తున్నారు. రూ.36లక్షలతో 9వ వార్డు జయప్రకాష్ నగర్‌లో ఏబీసీ నిర్మాణం చేపడుతున్నారు. మున్సిపాలిటీలోని అన్నివార్డుల్లోనూ కొన్నేళ్లుగా కుక్కల బెడద అధికమైంది. కొద్దినెలల్లోనే వీటి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. కుక్కల సంఖ్య పెరగకుండా ఉండేందుకు గానూ యానిమల్ బర్త్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఏబీసీ సెంటర్‌లో కుక్కలకు కుటుంబ నియంత్రణ చేసేందుకు ఆపరేషన్ థియేటర్, వాటిని ఉంచేందుకు కెనాల్స్ తరహాలో 12 బోన్‌లు, వాష్‌రూంలు నిర్మిస్తున్నారు. ఒకేసారి 12 కుక్కలను సెంటర్‌లో ఉంచేలా ప్రణాళికలు రూపొందించారు. సెంటర్ ప్రారంభమయ్యాక మున్సిపాలిటీ పరిధిలోని కుక్కలను ఏబీసీ సెంటర్‌కి తీసుకువస్తారు. ఇందుకు ప్రభుత్వం ఓఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఒక కుక్కను పట్టుకువచ్చి కుటుంబ నియంత్రణ చేసి వదిలితే రూ.1450 చెల్లించేలా ప్రభుత్వం ఆ సంస్థతో ఒప్పందం చేసుకుంది. వీధుల్లో పట్టుకువచ్చిన కుక్కను రెండు రోజుల పాటు పరీక్షించి ఉంచి మూడో రోజున ఆపరేషన్ చేస్తారు. మరో మూడు రోజుల పాటు పరిశీలనలోనే ఉంచుతారు. మొత్తం 7రోజుల పాటు ఒక కుక్క కేంద్రంలో ఉంచుతారు. ఆ తరువాత ఎక్కడ పట్టుకువచ్చారో అక్కడే వదిలేస్తారు. అయితే ఏబీసీలో ఏజెన్సీ నిర్వాహకులకు చెందిన సిబ్బందితో పాటు మున్సిపల్ సిబ్బంది ఒకరు విధులు నిర్వహిస్తారు. అవసరమైనపుడు పశువైద్యులు వచ్చి వెళ్తుంటారు. కుక్క 7రోజులు ఉంటే దానికి భోజనం సైతం ఆ ఏజెన్సీ నిర్వాహకులే సమకూరుస్తారు.

నిర్మాణ పనుల పరిశీలన

ఏబీసీ నిర్మాణపనులను శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, వార్డు కౌన్సిలర్లు పరిశీలించారు. సెంటర్ వివరాలు వారు కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. మరో 25రోజుల్లో సెంటర్ నిర్మాణ పనులు పూర్తిచేస్తామని కాంట్రాక్టర్ వారికి తెలిపారు. కౌన్సిలర్లు చైతన్యచౌహాన్, కుమ్మరి రాజు, బుక్క మ హేష్, శశికిరణ్, నందకిశోర్, ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు.

జనవరిలో అందుబాటులోకి..

మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక 9వ వార్డులో నిర్మిస్తున్న యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ జనవరిలో అందుబాటులోకి రానుంది.ఈసెంటర్‌లో ఒకేసారి 12 కుక్కలను ఉంచేలా ప్రణాళికలు రూపొందించారు. కుక్క లను పట్టుకువచ్చి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసి మళ్లీ వాటిని తిరిగి వదిలేస్తారు. ఇందుకు గానూ ప్రభుత్వం స్వతంత్ర ఏజన్సీతో టై అప్ అయ్యింది.

–లక్ష్మారెడ్డి, మున్సిపల్ కమిషనర్, జడ్చర్ల

పనుల్లో నాణ్యతను పాటించాలి

- మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్



21వ వార్డులోని శివాలయం వద్ద సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆయా వార్డుల్లో చేపట్టే పనుల్లో నాణ్యత పాటించాలని మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్ సూచించారు. శుక్రవారం 21వ వార్డు పరిధిలోని శివాలయం ఎదురు గల్లీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. అనంతరం 7, 8, 9వ వార్డులోని పంచముఖికాలనీ, ధనలక్ష్మీకాలనీ, మర్లులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఏఈ వైష్ణవి, కౌన్సిలర్ కట్టా రవికిషన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, పాపారాయుడు, చిన్నా, విఠల్‌రెడ్డి, గోటూరి రాజు, శ్రీనివాసులు, బాలరాజు, బాలయ్యగౌడ్, చంద్రశేఖర్, రాములు, గోపి, వెంకటేష్ పాల్గొన్నారు.

కఠినచర్యలు తీసుకుంటాం

జిల్లాలోని మూడు పట్టణాలలో ఎక్కడైనా అక్రమ భవన నిర్మాణాలు, లే–అవుట్లు వేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ అప్పయ్య హెచ్చరించారు. శుక్రవారం సాయత్రం మహబూబ్‌నగర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ (డీటీఎఫ్) సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖ తరపున కమిటీలోని సభ్యులకు అన్నివిధాలా సహకరిస్తామన్నారు. నియమ నిబంధనలను పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. కాగా, డీటీఎఫ్‌కు అందే ఫిర్యాదుల పరిష్కారానికి ఇకనుంచి తరచూ సమావేశాలు నిర్వహించాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. కార్యక్రమంలో అర్బన్ మండల తహసీల్దార్ ఘన్సీరాంనాయక్, భూత్పూర్ తహసీల్దార్ రహమాన్, ఏసీపీ జోత్స్నాదేవి, టీపీఓ లక్ష్మీపతి, టీపీఎస్‌లు విశాల్, శ్రీధర్, జడ్చర్ల డీటీ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం చేయాలి

అడ్డాకుల: చిన్న చిన్న నొప్పులకు మందులను వాడకుండా వ్యాయామం చేయాలని నిమ్స్ ఆస్పత్రి ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, విజయలక్ష్మి అన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఫిజియోథెరపీపై ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులకు భౌతికంగా వచ్చే ఇబ్బందులు, వాటి నివారణకు సంబంధించిన ఎక్సర్‌సైజ్‌ల గురించి రెండు గంటల పాటు వివరించారు. ఎంఈఓ కురుమూర్తి, ప్రసన్నకుమార్, రామలింగం, రాములు, వెంకటేష్, రమేష్‌కుమార్, సరస్వతి ఉన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి



రాజాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని రంగారెడ్డిగూడ మాజీ సర్పంచ్, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తల్లి జనంపల్లి శశికళారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రాయపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి రవిప్రకాష్, ఉపాధ్యాయులు రంజిత్, విజయలక్ష్మి, నాయకులు కృష్ణయ్య, దూళ్ల లింగం, శేఖర్, పాశం నర్సింహులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: మండలంలోని ఆలూరు జెడ్పీ హైస్కూల్‌లో 156 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అందించిన షూలను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

నవాబుపేట: మండల కేంద్రంలోని మణికంఠస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్ప మహాపడి పూజను వెంకటేష్ గురుస్వామి నిర్వహించారు. ఆ ప్రాంతమంతా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. పండ్లు, పూలతో ప్రత్యేకంగా అలంకరించిన స్వామి విగ్రహాలు అందరిని ఆకట్టుకున్నాయి. పురుషోత్తం గురుస్వామి ఆధ్వర్యంలో భజనలు చేశారు.

దేవరకద్ర రూరల్: కౌకుంట్లలో శుక్రవారం అయ్యప్ప మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన బజారు కురుమూర్తి స్వామి ఇంటి వద్ద కర్ణంరాజు, బాలరాజు గురుస్వాముల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మహా మంగళహారతితో పూజాకార్యక్రమాలు ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అయ్యప్ప మాలధారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మాటలు కాదు.. చేతల ప్రభుత్వం



మాట్లాడుతున్న టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి, నాయకులు

దేవరకద్ర: తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరకద్రకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ముందున్నారని అన్నారు. డిగ్రీ కళాశాల తెస్తామని చెప్పి ఇప్పటికే ప్రారంభించి తరగతులు నడుస్తున్నాయని తెలిపారు. దేవరకద్రను మున్సిపాలిటీగా మారుస్తామని చెప్పిన మాట ప్రకారం అసెంబ్లీలో మంత్రి శ్రీదర్‌బాబు మున్సిపాలిటీగా ప్రకటించారు. దీని వెనుక ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, పట్టణ కమిటీ అధ్యక్షుడు ఫారూఖ్, నాయకులు అంజన్‌కుమార్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఆదిహన్మంతరెడ్డి, నర్సింహారెడ్డి, నర్వశ్రీనివాస్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, రఘు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సంబరాలు

దేవరకద్రను మున్సిపాలిటీగా ప్రకటించడంతో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. దేవరకద్ర పాత బస్టాండ్‌లో బాణాసంచాను కాల్చారు. స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

మున్సిపాలిటీ చేయడంపై హర్షం

దేవరకద్రను మున్సిపాలిటీగా చేయడంపై బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు జట్టి నర్సింహా రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో చుట్టూ ఉన్న నాలుగు గ్రామాలతో కలిపి దేవరకద్రను మున్సిపాలిటీగా చేయాలని ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు రావడంతో వీలుకాలేదని, ఇప్పుడు రావడం ఆనందంగా ఉందన్నారు. దేవరకద్ర అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.50 కోట్లు కేటాయించాలని కోరారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- మాల సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు
- కేంద్ర హోంమంత్రి దిష్టిబొమ్మ దహనం



మహబూబ్‌నగర్‌లో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్/ న్యూటౌన్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కను హేళన చేస్తూ మాట్లాడటాన్ని నిరసిస్తూ మహబూబ్‌నగర్‌లో శుక్రవారం మాలల చైతన్య సమితి, జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో వేర్వేరుగా పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేసి బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మాలల చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మూలె కేశవులు, మాల మహానాడు రాష్ట్ర కోఆర్డినేటర్ బ్యాగరి వెంకటస్వామి మాట్లాడారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సీఐటీయూ కార్యాలయం నుంచి అమితిషా దిష్టిబొమ్మతో ప్రదర్శన నిర్వహించి అంబేడ్కర్ చౌరస్తాలో దహనం చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి మోహన్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆది విష్ణువర్ధన్, చంద్రకాంత్, రాజ్‌కుమార్, జహంగీర్, సురేష్, విజయ్‌కుమార్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చిన్న, ప్రధాన కార్యదర్శి మహేందర్, రామచంద్రయ్య, యాదయ్య, చెన్నయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలో అమితిషా దిష్టిబొమ్మను వ్యవసాయకార్మిక సంఘం, కులవివక్ష పోరాట సమితి నాయకులు దహనం చేశారు. జగన్, లక్ష్మిదేవి, యాదయ్య, మున్నా, రాములు పాల్గొన్నారు.

టీబీ లక్షణాలుంటే పరీక్షలు చేయించుకోవాలి



జడ్చర్ల టౌన్: టీబీ లక్షణాలుంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని డీఎంహెచ్ఓ డా.కృష్ణ సూచించారు. 100రోజుల టీబీ శిబిరాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని పోలేపల్లి గ్రామంలో నిర్వహించిన టీబీశిబిరాన్ని ఆయన సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. గంగాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.నరేష్, డా.గురుప్రసాద్, సిబ్బంది ఉన్నారు. పట్టణంలోని అర్బన్‌హెల్త్ సెంటర్‌ను డీఎంఅండ్‌హెచ్ఓ తనిఖీ చేశారు. జడ్చర్ల ఫైర్‌స్టేషన్ సిబ్బంది అగ్నిప్రమాదాల నివారణపై నిర్వహించిన మాక్‌డ్రిల్‌ను ఆయన పరిశీలించారు. ఆయన వెంట వైద్యాధికారి మనుప్రియ ఉన్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటాలి

- టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్



విద్యార్థులను సన్మానించిన ఒబేదుల్లా కొత్వాల్

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి సీఎం కప్ కరాటే పోటీల్లో విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించాలని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జరిగిన సీఎంకప్ జిల్లాస్థాయి కరాటే ఎంపికల్లో కింగ్ షోటోకాన్ విద్యార్థులు ఈ నెల 29 నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. సీనియర్ విభాగం కుమితే 55కేజీ కేటగిరిలో మహ్మద్ అర్ష్ జమీల్, +75కేజీలో హుజేఫా షరీఫ్, –60కేజీలో మహ్మద్ మొయినొద్దీన్, జూనియర్ విభాగం –61కేజీలో ఎండి.బాలేష రీఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఒబేదుల్లా కొత్వాల్ తన నివాసంలో ఆవిద్యార్థులను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ, ఖాలిద్ నవీన్, ఖాజా ఖుతుబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

సాక్షి నెట్‌వర్క్: సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. శుక్రవారం వారిని ఆయా మండలాల్లో పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

- నవాబుపేట మండలంలో సిద్దార్థ పాఠశాల కరస్పాండెంట్ రూపావతి, భానుప్రతాప్, కోచ్ అశ్వక్ విద్యార్థులను అభినందించారు. హర్షిత్ 24 కేజీల విభాగం, గణేష్ 27కేజీల విభాగంలో బంగారు పతకాలు సాధించారు.
- జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని బాదేపల్లి బాలికల హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. బ్యాడ్మింటన్ విభాగంలో 9వతరగతి చదువుతున్న మీన, యోగాలో నిత్య, మీనహసుమమ్మ ఎంపికయ్యారు. వీరిని ఆపాఠశాల హెచ్‌ఎం లక్ష్మి, పీడీ శ్రీదేవి అభినందించారు.
- మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎదిర జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి పూజిత ప్రతిభచాటి ద్వితీయస్థానంలో నిలిచినట్లు హెచ్‌ఎం హేమచంద్రుడు తెలిపారు. విద్యార్థి పూజితను కరాటే మాస్టర్ సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ పరశురాములు శాలువాతో సత్కరించారు.
- మిడ్జిల్ మండలంలోని సెయింట్ మేరీస్‌కు విద్యార్థులు వూషు పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఆ పాఠశాల వద్ద విద్యార్థులు ఆలీషా తబుసుం, నిల్వానాయక్, మురారీ, అంజీలను ఘనంగా సన్మానించారు. టీచర్లు జోసఫ్, సీనా, లింగం, రవి, జహీర్, లక్ష్మణ్, గౌస్ పాల్గొన్నారు.
- చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తి గ్రామానికి చెందిన నలుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికయ్యారు. నవీన్, లక్ష్మణ్‌లు నిఖిల్, పావని పలు క్రీడల్లో ప్రతిభ కనబరిచారు. వీరు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపై గ్రామస్తులు అభినందించారు.

రోడ్డు విస్తరణ పనుల అడ్డగింత

- సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో ఒకే రోజు మూడు ప్రమాదాలు
- రోడ్డుపై మట్టి తొలగింపజేసిన అధికారులు



రోడ్డుపై మట్టి తొలగింపు పనులు

జడ్చర్ల టౌన్: జాతీయ రహదారి నిర్మాణపనుల్లో భాగంగా వేసిన మట్టితో ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో శుక్రవారం 12, 3వ వార్డు కౌన్సిలర్లు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. దీంతో అధికారులు స్పందించి రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. స్థానిక సిగ్నల్ గడ్డలో 167వ నెంబరు జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. రోడ్డుపై ఎక్కడికక్కడ మట్టి పేరుకుపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈక్రమంలో నిత్యం ప్రజలు ప్రమాదాలబారిన పడుతున్నారు. శుక్రవారం సాయంత్రం ఇదే ప్రాంతంలో వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు బైక్‌లపై నుంచి కిందపడి గాయాల పాలయ్యారు. ఒకే రోజు ముగ్గురు ప్రమాదాల్లో గాయాల పాలు కావటంతో 3, 12వ వార్డు కౌన్సిలర్లు సతీష్, రఘురాంగౌడ్ స్పందించారు. జాతీయరహదారి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. రోడ్డు చదునుచేయకుండా పనులు చేయవద్దంటూ హెచ్చరించారు. పనులు నిలిపిన సమయంలోనే స్కూటీపై వెళ్తున్న ఇద్దరు జారి కిందపడ్డారు. వారికి స్వల్పగాయాలయ్యాయి. కౌన్సిలర్లకు ఆ ప్రాంతవాసులు సైతం మద్దతు పలికారు. స్పందించిన నేషనల్ హైవే శాఖ ఏఈ రవి పెద్దజేజర్ సహాయంతో మట్టిని చదును చేసేందుకు చర్యలు చేపట్టారు. అరగంట పాటు శ్రమించి రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని తొలగించి చదును చేశారు. లయన్స్ క్లబ్ వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. ఆప్రాంతంలో రాత్రివేళ చదును చేస్తామని కాంట్రాక్టర్ హామీ ఇచ్చారు.

తెలంగాణ వారిని నియమించాలని వినతి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: తెలంగాణ పీఈసెట్ కన్వీనర్‌గా తెలంగాణ ప్రాంతం వారిని నియమించాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్ పేర్కొన్నారు. ఈమేరకు పీయూలో వైస్ ఛాన్స్‌లర్ జీఎస్ శ్రీనివాస్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీజీపీసెట్ నిర్వహించేందుకు అవకాశం రావడం గొప్ప విషయమన్నారు. కానీ తమిళనాడుకు చెందిన వారిని కన్వీనర్‌గా నియమించడం సరైన అంశం కాదని అన్నారు. తెలంగాణకి చెందిన చెందిన సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ కన్వీనర్‌గా నియమించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాము, పవన్‌కుమార్, గణేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ సర్వే

దేవరకద్ర: మండలంలోని బలుసుపల్లిలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగింది. దరఖాస్తులు చేసుకున్న లబ్దిదారుల ఇళ్ల వద్దకు అధికారులు వెళ్లి వారి వివరాలు సేకరించారు. సర్వేలో ఎంపీడీఓ శ్రీనివాసరావు పాల్గొని లబ్దిదారులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు చంద్రమౌళి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 6వ మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈమేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, వెంకటేష్ మాట్లాడారు. ఈనెల 29, 30వ తేదీల్లో నల్లగొండలో నిర్వహించే మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. విద్యారంగంపై మేధావులు లోతైనా చర్చ జరుపుతారని, పలువురు ప్రజాప్రతినిధులు, రచయితలు హాజరు అవుతారని పేర్కొన్నారు.టీచర్లు, విద్యార్థులు హాజరుకావాలన్నారు. కిష్టయ్య, ఉమాదేవి, భాస్కర్, అజయ్, హేమంత్ పాల్గొన్నారు.

విద్యార్థినులు చదువుకు దూరం



రాజాపూర్‌లో కేజీబీవీ ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థినులు, నాయకులు

రాజాపూర్: కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కొన్నిరోజులుగా సమ్మె చేస్తుండటంతో ఆ పాఠశాలల్లోని విద్యార్థినులు చదువుకు దూరమౌతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11రోజులుగా ఉద్యోగులు సమ్మె చేస్తుండటంతో విద్యార్థినులకు పాఠాలు చెప్పే వారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని, లేదంటే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. జిల్లా నాయకులు ప్రవీణ్, నందు, ఈశ్వర్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ వద్ద ధర్నా

జడ్చర్ల టౌన్:ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దేవునిగుట్టతండా వద్ద ఉన్న కేజీబీవీ వద్ద ధర్నా నిర్వహించారు. నాయకులు ప్రవీణ్, ఈశ్వర్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మండలంలోని కోడూర్ వద్ద ఉన్న మహబూబ్‌నగర్‌రూరల్ కేజీబీవీ వద్ద శుక్రవారం వారు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నాయకులు ప్రవీణ్, నందు, ఈశ్వర్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని మమతానగర్‌కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. మమతానగర్‌కాలనీకి చెందిన హబీబ్‌ఖాన్ ఇంటికి తాళం వేసి మంగళవారం పనిమీద స్వగ్రామానికి వెళ్లాడు. శుక్రవారం ఇంటికి రాగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాళం విరగ్గొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు 3 తులాల బంగారు, 10 తులాల వెండి ఆభరణాలతోపాటు రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.